సూర్య
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
శనివారం,11 మే 2024



## వాహన తనిఖీల్లో రూ.2 లక్షల 60 వేలు స్వాధీనం



**కామవరపుకోట,మేజర్‌న్యూస్:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కామవ రపుకోట ఎన్నికల చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలలో భాగంగా శుక్రవారం ఒక వ్యక్తి వద్ద ఎటువంటి ఆధారాలు లేని 2 లక్షల 60 వేల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు చెక్ పోస్ట్ ఎన్నికల అధికారి మహమ్మద్ మోహిద్దీన్ తెలిపారు. ఈ నగదు గాలాయగూడెంకు చెందిన వ్యక్తి వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు ఈ నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా ఏలూరు ట్రెజరీలో జమ చేయబడుతుందని తెలిపారు. నగదుకు సంబంధించిన తగు పత్రాలను చూపించినట్లయితే నగదు సంబంధించిన వ్యక్తికి ఇవ్వడం జరుగుతుందన్నారు. వాహనాల తనిఖీలలో పోలీసు సిబ్బంది కే రమేష్, కే రామకృష్ణ, సూర్యరావు, షేక్ నాగూర్,ఎం.నాగార్జున,వీడియో గ్రాఫర్లు వీరమల్ల మధు, సౌజన్ సాయి పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన కొవ్వలి నాయుడు

**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** ఉండి నియోజకవర్గం ప్రజాగలంసభకు విచ్చేసిన తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబుకు పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలుకారు.







# పోలవరం పూర్తి - రాజధానిగా అమరావతి అభివృద్ధి

- నిర్వాసితులకు న్యాయం
- 100 రోజుల్లో గంజాయి మాఫియా అణిచివేత
- జగన్ చేసేవన్నీ చీకటి రాజకీయాలు
- ఏలూరు ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

**ఏలూరు,సూర్యబ్యూరో:** రాష్ట్ర భవిష్యత్,మన బిడ్డల భవిష్యత్ మార్చుకునేందుకు మరో 3 రోజులే సమయం ఉంది. వైసీపీ అవినీతి, దోపిడి ప్రభుత్వానికి ముగింపు పలికి ప్రజాస్వామ్యానికి, స్వేచ్ఛకు నాంది పలకాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.శుక్రవారం ఏలూరులో ప్రజాగళం సభ, ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఏలూరు అసెంబ్లీ టిడిపి అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి),ఏలూరు ఎంపి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ గెలిపించాలని కోరారు.ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ కూటమికి మీరు వేసే ఓటు రాష్ట్ర భవిష్యత్ కోసం వేస్తున్న ఓటన్నారు. మీరువేసేఓటురైతులకుగిట్టుబాటుధర తెస్తుందని,యువతకు ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు. మహిళలకు రక్షణ కల్పిస్తుందనీ. నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గిస్తుందన్నారు. జగన్ నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నారని విమర్శించారు. ఈనెల 13న మీరు వేసే ఓటుతో తాడేపల్లి ప్యాలెస్ బద్దలు కావాలన్నారు. పోలవరం పూర్తయిఉంటే రాష్ట్రం సస్యశ్యామలం అయ్యేదని అలాంటి ప్రాజెక్టు నిర్మాణంలో నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాపై,నాకుటుంబంపై వైసీపీ మూక చేసిన దాడి కంటే రాష్ట్రంపై కొట్టిన దెబ్బకే ఎక్కువ బాధ కలుగుతోందన్నారు. వైసీపీ పాలనలో ప్రజల జీవితాలు 30 ఏళ్లు వెనక్కి వెళ్లాయని,రాష్ట్రాన్ని గంజాయి,డ్రగ్స్‌కి కేంద్రంగా మార్చారని ధ్వజమెత్తారు. నేను అధికారంలోకి రాగానే 100 రోజుల్లో గంజాయి మాఫియాను ఉక్కుపాదంతో అణిచివేస్తానన్నారు. అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేస్తామన్నారు. జగన్ పోలవరాన్ని గోదావరిలో ముంచేశాడని పోలవరం నిర్వాసితులందరికీ ఆర్.అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి వారికి అన్ని విధాల న్యాయం చేస్తామన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, పలువురు టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏలూరు జిల్లాలో ఎన్నికలకు అంతా సిద్ధం

- 1744 పోలింగ్ స్టేషన్లు -16.37 లక్షల మంది ఓటర్లు
- ఓటు హక్కు మాత్రమే కాదు ప్రతీ పౌరుని బాధ్యత
- పోలింగ్‌కు విఘాతం కలిగించే వారిపై ఉక్కుపాదం




**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు జిల్లాలో ఈనెల 13వ తేదీన సార్వత్రికఎన్నికల పోలింగ్‌కు అన్ని సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఎన్నికల పోలింగ్ సంసిద్ధతను పాత్రికేయులసమావేశంలో తెలియజేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలోని 7అసెంబ్లీ నియోజక వర్గాలలోని1744పోలింగ్ స్టేషన్లలో 16.37 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈనెల 13వ తేదీన ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6గంటలవరకుపోలింగ్‌నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా మరియు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.పోలింగ్‌నకు 48 గంటల ముందు నుండి ఎటువంటి ప్రచార కార్యక్రమాలు చేయరాదనిరాజకీయ ప్రచారాలకు శనివారం సాయంత్రం 6గంటల నుండి నిశ్శబ్ద సమయమని కలెక్టర్‌చెప్పారు. ప్రింట్ మీడియా ప్రచారం నిమిత్తం ఎంసిఎంసి అనుమతి తప్పనిసరిగా తీసుకోవలసి ఉంటుందన్నారు. జిల్లాలోఇంతవరకు 15కోట్లరూపాయలు విలువైన వస్తువులు, నగదును సీజ్ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 1744 పోలింగ్ స్టేషన్లకుగాను 1069 పోలింగ్ స్టేషన్‌లలో పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి,కేంద్ర,రాష్ట్ర ఎన్నికల కమిషన్‌లు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 416 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లుగా గుర్తించడం జరిగిందని, ఆయా పోలింగ్‌స్టేషన్లలోలైవ్‌టెలికాస్టింగ్ ఏర్పాటుచేశామని, మైక్రో అబ్జర్వర్‌లను నియమించడంజరిగిందన్నారు పోలింగ్ అనంతరం వాహనాలలో ఏలూరులోని సర్ సి.ఆర్.ఆర్.కాలేజీలో ఏర్పాటుచేసిన రిసెప్షన్ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూంలలో భద్రపరచడం జరుగుతుంద న్నారు.జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి మాట్లాడుతూజిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు 4 వేల మంది భద్రత సిబ్బందిని వినియోగిస్తున్నామని, వీరిలో 1000మంది పారా మిలట్రీ సిబ్బంది ఉన్నారన్నారు. జిల్లాలో ఎన్నికల పోలింగ్ విఘాతానికి పాల్పడే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా రౌడీ షీట్లు తెరుస్తామని స్పష్టం చేశారు. జిల్లా రెవిన్యూ అధికారి డి.పుష్పమణి,ప్రభృతులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న 15వేల 615 మంది ఉద్యోగులు



**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లాలో 15 వేల 615 మంది ప్రభుత్వ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కును వినియోగించుకన్నారని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఈనెల 9వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది, పోలీసు సిబ్బంది, ఇతర అత్యవసర సేవలకు చెందిన శాఖల సిబ్బందికి అవకాశం ఇవ్వడం జరిగిందన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 1614 మంది,దెందులూరు నియోజకవర్గంలో 2165 మంది, ఏలూరులో 3123 మంది, పోలవరంలో 2872 మంది, చింతలపూడిలో 2267 మంది, నూజివీడులో 1923 మంది, కైకలూరు నియోజకవర్గంలో 1651 మంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలియజేసారు.

## హింసకు,రీపోలింగ్‌కు తావు లేకుండా చూడాలి



**భీమవరం,మేజర్ న్యూస్ :** హింసకు,రీపోలింగ్‌కు తావు లేకుండా ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో న్యాయంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు . ఈనెల 13న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం చివరి 72 గంటల్లో, పోలింగ్ రోజున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నెల 11 వ తేదీ సాయంత్రం 6.00 గంటల నుండి పోల్ ముగిసే సమయానికి 48 గంటల ముందు నుండి నిశ్శబ్ద కాలం అమల్లోకి వస్తున్నదని, ఆ సమయంలో ఎన్నికల ప్రచారానికి తెరపడుతుందని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరూ ఉల్లంఘించకూడదన్నారు. చట్టవిరుద్ధమైన సమావేశాలపై నిషేధం మరియు 48 గంటల వ్యవధిలో (సైలెన్స్ పీరియడ్) బహిరంగ సభలను నిర్వహించడంపై సెక్షన్ 144 కింద నిషేదిస్తూ ఆదేశాలు జారీ చేయబడతాయన్నారు. పోల్ ముగింపు సమయం ఆధారంగా 48 గంటల డ్రై డే సమయం సవరించబడుతుందన్నారు. పోల్ ముగిసే 48 గంటల ముందు లౌడ్ స్పీకర్లను అనుమతించడం జరగదు అన్నారు. ఎన్నికల్లో ఎటు వంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా ఇప్పటికే పట్టుదలతో మేము చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. అంతర్ రాష్ట్రాల నుండి వచ్చే లారీలు, వాణిజ్య వాహనాలు, తేలికపాటి వాహనాల కదలికలపై గట్టి నిఘా ఉంచడం జరిగిందన్నారు.పోల్ ముగియడానికి నిర్ణయించిన సమయం ముగిసే 48 గంటల వ్యవధిలో రాజకీయ స్వభావం గల బల్క్ ఎస్ ఎం ఎస్ లను పంపడం నిషేధించబడిందన్నారు. పోలింగ్ రోజు, ఎన్నికల ముందు ప్రింట్ మీడియా లో రాజకీయ ప్రకటనలను జిల్లా ఎంసిఎంసీ నుండి ముందస్తు ధృవీకరణతో ప్రచురించుకోవచ్చని ఆయన తెలిపారు.

## ఆలోచింప చేస్తున్న ఈ ఇంట్లో ఓట్లు అమ్మబడవు బ్యానర్




**కామవరపుకోట,మేజర్ న్యూస్:** ఒక రెండు రోజుల్లో ఎన్నికల తేదీ ఉండనగా అనేక రాజకీయ పార్టీల వారు ఓటర్ లను కొనుగోలు చేయటానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ఓటర్ స్లిప్పులతో పాటు డబ్బు,మద్యం,బహుమతులు వంటివి అందజేసి తమ పార్టీలకు ఓట్లు వేయమని అభ్యర్థిస్తుంటారు. కామవరపుకోటకు చెందిన వీరమల్ల మధు కుటుంబ సభ్యులు తమ ఓటును తప్పకుండా వేస్తాము కానీ ఈ ఇంట్లో ఓట్లు అమ్మబడవు అని తమ ఇంటి ఎదురుగా బ్యానర్ ఏర్పాటు చేయటం పలువురిని ఆలోచింపచేస్తుంది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని,ఓటు వేయని వారిని ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా ప్రకటిస్తే తప్పనిసరిగా ఓటింగ్ శాతం పెరుగుతుందన్నారు. ఏ ప్రభుత్వం వారైనా సరే వృద్ధులకు పెన్షన్ అందజేయడంతో పాటు ఉచిత విద్య, ఏ ఆసుపత్రికి వెళ్లినా ఉచిత వైద్యం అందజేసినట్లయితే ప్రజలకు ఇతర పథకాలు అందజేయాల్సిన అవసరం ఉండదనే అభిప్రాయం వ్యక్తం చేశారు.

## సీఎం జగన్ పాలకొల్లు పర్యటన లేనట్టే

**పాలకొల్లు,మేజర్ న్యూస్:** సీఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ప్రతి నియోజకవర్గంలో దాదాపు పర్యటించారు, అయితే పాలకొల్లు 8వ తేదీన జరగవలసిన ప్రోగ్రాం క్యాన్సిల్ కావడం, తిరిగి 11న జరుగుతుందని వార్తలు వచ్చాయి,అయితే విశ్వాస నీయ వర్గాల ద్వారా తెలిసిన సమాచారం పాలకొల్లు బహిరంగ సభ లేనట్టేనని తెలిసింది.

# బిజెపిది డబల్ ఫెయిల్యూర్ సర్కార్

- బిజెపి పంచన వైసిపి టిడిపి జనసేన చేరడం సిగ్గుచేటు
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను విజన్ 22లో పెట్టింది మొదట చంద్రబాబె
- భీమవరం బహిరంగ సభలో సిపిఎం పొలిట్బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు




**భీమవరం,మేజర్‌న్యూస్:** చంద్రబాబు పదేళ్లపాటు, జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లపాటు బిజెపి పంచన,చంకన ఉన్నప్పుడు లేని డబల్ ఇంజిన్ సర్కార్ ఇప్పుడు ఎక్కడి నుంచి వస్తుందని బిజెపి చెప్పుకునే డబల్ ఇంజిన్ సర్కార్ కాదని అది డబల్ ఫెయిల్యూర్ సర్కారని సిపిఎం పొలీస్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. సిపిఎం సిపిఐ ఇండియా కూటమి బలపరిచిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అసెంబ్లీ అభ్యర్థుల విజయం కోరుతూ పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన బహిరంగ సభ నిర్వహించారు. స్థానిక కొత్త బస్టాండ్ దగ్గర నుంచి అన్నపూర్ణ థియేటర్, పోలీస్ బొమ్మ సెంటర్ మీదగా ప్రకాశం చౌక్ వరకు సాగిన ఈ ప్రదర్శనలో వామపక్షాలు,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు కార్మిక వర్గం, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి పి బలరాం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఎం పొలీస్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రధాన వక్తగా ప్రసంగించారు.దేశంలో ఉన్న 27 పార్టీలు ఒకే తాటిపైకి వచ్చి ఇండియా కూటమిగా ఏర్పడడం జరిగిందన్నారు. ఇప్పుడు దశలో జరిగిన ఎన్నికల్లో ఇండియా కూటమి హవా కొనసాగడంతో మోడీకి భయం పట్టుకుందన్నారు. 100 సీట్లు కూడా రావని భయంతో మోడీ ఉన్నారని చెప్పారు. జగన్ రాష్ట్రంలో ఈ విధంగానే భయపడుతున్నారని చెప్పారు. ఇండియా కూటమి అధికారంలోకి రావాలంటే ఈ ప్రాంతంలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులు గెలిపించుకోవాలన్నారు. నరసాపురం మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, నర్సాపురం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కేబీఆర్ నాయుడు , సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడారు. ఈ సభలో మాజీ కాంగ్రెస్ ఎంపీ మల్చంద్ మినా, భీమవరం, ఉండి కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థులు అంకెం సీతారం,గోపాలకృష్ణంరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్వి గోపాలన్,చింతకాయల బాబురావు , పివి ప్రతాప్, కే పెద్దరాజు ,కె నాగరాజు, జిల్లా నాయకులు కే రాజా రామ్మోహన్ రాయ్ పాల్గొన్నారు.

## పోల్ డే మేనేజ్ మెంట్ యాప్‌పై అవగాహన

- రిటర్నింగ్ అధికారి,జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి



**దెందులూరు,మేజర్ న్యూస్:** ఎన్నికలనిర్వహణకు నియమించిన సెక్టార్ అధికారులు, పోల్ డే మేనేజ్ మెంట్ యాప్ పై పూర్తి అవగాహన కలిగి యుండాలని దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. శుక్రవారం దెందులూరు ఆర్వో కార్యాలయంలో నియోజకవర్గంలోని 23 మంది సెక్టార్ అధికారులకు పోల్ డే మేనేజ్ మెంట్ యాప్ పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు, సెక్టార్ అధికారులు, పోల్ డే మేనేజ్ మెంట్ యాప్ ను డౌన్ లోడ్ చేసుకొని పోలింగ్ ముందురోజు ఎన్నికల సిబ్బంది ఎన్నికల మెటీరియల్ తీసుకొని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి బయలుదేరి పోలింగ్ కేంద్రాలని చేరుకునే వరకు అన్ని విషయాలను పోల్ డే మేనేజ్ మెంట్ యాప్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. పోలింగ్ రోజైన ఈనెల 13వ తేది ఉదయం 6.00 గంటలకు మాక్ పోల్ జరిపి యాప్ నందు అప్ లోడ్ చేయాలన్నారు.శిక్షణా కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, దెందులూరు తహశీల్దారు వరహాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## శేష వాహనంపై భగవత్ రామానుజాచార్యులు

**నరసాపురం,మేజర్‌న్యూస్ :** శ్రీ ఆదికేశవ ఎంబెరుమానార్ స్వామి వారి దేవస్థానములోభగవత్ రామానుజాచార్యులు వర్షతిరునక్షత్ర ఉత్సవాలలో భాగంగాశుక్రవారంశేషవాహనంపైభగవత్ రామానుజా చార్యులు, అగ్రహారం మాడవీధుల్లో దర్శనమిచ్చారు. అనంతం యాగశాలలో తిరుమంత్రార్థం ఉత్సవం సేవాకాలం తీర్థప్రసాద గోష్టి జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుప్పాల ఆదినారాయణ, ఆలయ కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.



## ధాన్యం కొనుగోలు ద్వారా రూ.226 కోట్లు జమ

- వర్షాలు కారణంగా క్షేత్రస్థాయి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల నియామకం



**ఏలూరు,మేజర్ న్యూస్:** రబీ పంటకు ఇప్పటివరకు 1,89,386.720 మెట్రిక్ టన్నుల ధాన్యమును కొనుగోలు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి ధాన్యం కొనుగోలు పై మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో రబీ పంటకు 2 లక్షల 40వేలు మెట్రిక్ టన్నుల అలాట్మెంట్ కి గాను ఇప్పటివరకు 1,89,386.720 మెట్రిక్ టన్నుల ధాన్యంను నేటివరకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు రైతులకు చెల్లించవలసిన రూ.396.63 కోట్లకు గాను రూ.226.22 కోట్లు రూపాయలు రైతుల వ్యక్తిగత ఖాతాలకు జమచేయడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా ముదినేపల్లి మరియు పోలవరం మండలంలకు గాను ఖరీఫ్ సీజన్లో మిగిలిపోయిన 4770.840 మెట్రిక్ టన్నుల ధాన్యమును కూడా కొనుగోలు చేయడం జరిగిందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకొని ధాన్యాన్ని భద్రపరచుకోవడం ద్వారా ధాన్యంను నష్టం కలుగకుండా రైతులు చూచుకోవాలని జాయింట్ బి.లావణ్యవేణి తెలిపారు.

## బైబిల్ శిక్షణా తరగతులు



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్:** మండల కేంద్రం .గ్రేస్ మందిర్‌లో బాలలకు బైబిల్ పై శిక్షణా తరగతులు నిర్వహించినట్లు మందిర్ వ్యవస్థాపకులు బ్రదర్ బి ఎజ్రా శాస్త్రి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగాఎజ్రా శాస్త్రి మాట్లాడుతూ బాలురు నడవాల్సిన త్రోవను బాల్యం లోనే వారికి బోధించడం వలన పెద్ద వారు అయిన తరువాత దాని నుండి తరలి పోరు అని తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో నైపుణ్యం కలిగిన టీచర్లు చే బైబిల్ లో విషయాలు బోధించడం జరిగింది. ఈ తగతులకులకు మండలంలోని పలు గ్రామాలకు చెందిన రెండు వందల మంది బాల బాలికలు పాల్గొన్నారు. ఈ శిక్షణ తరగతులు ఆటలు పోటీలు,పాట లు నిర్వహించారు. ఈ పరీక్షల్లో నైపుణ్యం కనబరిచిన వారికి బహుమతులు అందించారు. ప్రతి దినం వచ్చే బాలలకు సంఘస్తులు ఆహారాన్ని అందించారు. ఈ కార్యక్రమం లో నిర్మల శాస్త్రి, జ్యోతి, శాంతి, వెంకటేశ్వరి, ప్రశాంతి, లక్ష్మి, అమ్ములు, టోనీ, వంశీ, శివ, డేవిడ్ రాజు, సుబ్రహ్మణ్యం, అశోక్, రాఘవులు, సంఘస్తులు పాల్గొన్నారు.

## పోలింగ్ నేపథ్యంలో చెక్ పోస్టుల వద్ద పకడ్బందీ తనిఖీలు



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్:** పోలింగ్ తేది దగ్గం పడుతున్న నేపధ్యంలో చెక్ పోస్టుల వద్ద తనిఖీలు మరింత పకడ్బందీగా నిర్వహించాలని ఏలూరు పార్లమెంటరీ ఎన్నికల వ్యయ పరిశీలకులు టి. జోర్డాన్ బూటియా తెలిపారు. శుక్రవారం జీలుగుమిల్లి దగ్గర ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టును ఆయన పరిశీలించి,వివిధ వాహనాల తనిఖీ తీరును ఆయన పరిశీలించారు. అనంతరం జంగారెడ్డిగూడెం వద్ద వివిధ వాహనాల తనిఖీలను పరిశీలించారు. దీని వెంట సహాయ వేయ పరిశీలకులు పిఎస్పీఎస్ శివ నాగరాజు ఉన్నారు.

# మెగా డీఎస్సీ పైనే మొదటి సంతకం

- అరాచక పాలన కి ఆంధ్రప్రదేశ్ కేరాఫ్ అడ్రస్
- ఎంపిగా శ్రీనివాస్ వర్మ,ఎమ్మెల్యేగా రఘురామను గెలిపించండి...
- ఉండి మోగ రోడ్‌షోలో చంద్రబాబు



**ఉండి,మేజర్‌న్యూస్:** గడిచిన ఐదేళ్ల కాలంలో అరాచకానికి ఆంధ్రప్రదేశ్ పరాకాష్టకు చేరుకుందని ఫ్యానుకు ఓటు వేస్తే మీ మెడకు మీరే ఉరి వేసుకున్నట్టేనని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మొదటి సంతకం డీఎస్సీ పై పెడతానని రాజధాని నిర్మాణం చేపడతానని పోలవరం పూర్తి చేస్తానని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఉండి పెద్ద వంతెన సెంటర్లో శుక్రవారం ఏర్పాటుచేసిన ప్రజాగలం బహిరంగ సభకు హాజరైన చంద్రబాబునాయుడు మాట్లాడుతూ. తెలుగుదేశం పార్టీ బిజెపి జనసేన పార్టీలు కూటమి అభ్యర్థులుగా నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాస్ వర్మ ఉండి అసెంబ్లీ అభ్యర్థి కనుమూరి రఘురామ కృష్ణంరాజును అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించి అఖండ విజయాన్ని చేకూర్చాలని కోరారు. జెండాలు 3 అయినప్పటికీ అజెండా మాత్రం ఒక్కటేనని తెలిపారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాల్లో మాత్రమే హీరో కాదని రియల్ లైఫ్‌లో హీరోనే అని కొనియాడారు. సైకో పాలనపై ప్రశ్నించిన సొంత పార్టీ పార్లమెంటు అభ్యర్థి అయిన కనుమూరి రఘురామకృష్ణమరాజును పోలీసులతో కొట్టించి పైశాచిక ఆనందాన్ని పొంది సైకో ఇజం చూపించిన జగన్మోహన్ రెడ్డికి ఓటు అనే ఆయుధం ద్వారా బుద్ధి చెప్పాలని ఇంటికి సాగనంపాలని అందుకు ప్రతి ఒక్కరు కంకణబద్ధులై ఉండాలని ఆయన సూచించారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి మీ భూములుపై మీ ఆస్తులు పై అధికారం జగన్మోహన్ రెడ్డికి ఇస్తారా సైకిల్ గుర్తుపై ఓటు వేసి మీ ఆస్తులు పై రాజముద్ర వేసుకొని మీరు తీసుకుంటారా మీరే ఒక్కసారి ఆలోచన చేయండి అని సూచించారు. నరసాపురం పార్లమెంట్ సభ్యులు ఉండి అసెంబ్లీ అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణమరాజు మాట్లాడుతూ. సైకో వద్దు సైకిల్ ముద్దు అనే భావనతో ప్రజలందరూ మే 13న జరగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తెలుగుదేశం పార్టీని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉండి అసెంబ్లీ అభ్యర్థిగా నాకు వేసిన ఓట్లన్నీ బిజెపి పార్లమెంట్ సభ్యులైన శ్రీనివాస్ వర్మకు వేయాలని వారు అన్నారు. బిజెపి నరసాపురం పార్లమెంట్ సభ్యులు శ్రీనివాస్ వర్మ,ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు,జనసేన ఇంచార్జ జుత్తిగా నాగరాజు ప్రసంగించారు.

## ముస్లింల 4శాతం రిజర్వేషన్‌పై వైసీపీ కపట ప్రేమ



**అగిరిపల్లి,మేజర్ న్యూస్ :** ముస్లిం మైనార్టీల 4శాతం రిజర్వేషన్ పై వైసీపీ దుష్ప్రచారం చేస్తూ,కపట ప్రేమ చూపిస్తుందని అగిరిపల్లి జామియా మసీద్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ముస్లిం నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి అభ్యర్థికి ఓటు వేయవద్దని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ముస్లిమ్స్ 4శాతం రద్దు చేస్తారని దుష్ప్రచారంచేస్తుందని ,వైసీపీ కపట ప్రేమ చూపిస్తుందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్రాష్ట్రంలో టీడీపి ప్రభుత్వం వచ్చిన తరువాతే మత ఘర్షణలు ఆగి,అన్ని మతాల ప్రజలు ప్రశాంతంగా జీవిస్తునారని తెలిపారు.టీడీపి ప్రభుత్వం లోనే మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ముస్లిమ్స్కి కార్పొరేషన్ ద్వారా ఋణాలు మంజూరు చేసి,దుకాణ్ హార్ మాకాన్, రోషని తదితర సంక్షేమ పథకాలు చేసిన్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో జామియా మస్జీద్ కమిటీ అధ్యక్షులు ఎస్ కె చాన్ భాష, కమిటీ సభ్యులు, తదితర ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలి



**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను జెఏసి చైర్మన్ చోడగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జె ఏ సి బృందం శుక్రవారం కలిసింది. ఈ నెల 13 వ తేదీన జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల కు సంబంధించి ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది కి తగు ఏర్పాట్లు విషయంలో కలెక్టర్‌కి తెలియజేయడటం జరిగింది. ముఖ్యంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అందరికి డ్యూటీ సర్టిఫికెట్ ఇవ్వాలని. దూరప్రాంత. ఏజెన్సీ ప్రాంతాలలో పోలింగ్ విధులు నిర్వర్తించే సిబ్బందికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని,వేసవి తీవ్రత దృష్ట్యా డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, పోలింగ్ కేంద్రాల వద్ద తగు సౌకర్యాలు కల్పించాలని కోరారు.ఎన్నికల విధులను నిర్వర్తించే ఉద్యోగులకు 14 న సెలవు వెసులుబాటు కల్పించాలని కోరారు. జిల్లా ఎన్నికల అధికారి వారు స్పందిస్తూ. ఎన్నికల నిర్వహణ విషయం లో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జెఏసి అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్ ఎస్ హరనాథ్,ఏలూరు తాలూకా జెఏసి చైర్మన్ జి.శ్రీధర్ రాజు,కన్వీనర్ కె.సత్యనారాయణ,పూడి శ్రీనివాసరావు,హరినారాయణ పాల్గొన్నారు..

## ముఖ్యమంత్రి జగన్ సభకు ఏర్పాట్లు పరిశీలన



**కైకలూరు,మేజర్ న్యూస్:** ముఖ్యమంత్రి నిర్వహి ంచనున్న సభా స్థలాన్ని జిల్లా ఎస్పీ మేరి ప్రశాంతి శుక్రవారం పరిశీలించారు. హెలిప్యాడ్, ముఖ్యమైన ప్రాంతాలను పరిశీలించి ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన బందోబస్త్ ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి కైకలూరు పర్యటించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు డిఎస్పి ఈ శ్రీనివాసులు డిటిసి డిఎస్పీకే ప్రభాకర్ రావు,ఎస్ఈబిఇన్స్పెక్టర్ మల్లేశ్వరరావు, కైకలూరుసిఐ ఆకులరఘు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ‘ఈ ఇంట్లో ఓట్లు అమ్మబడవు’






**ఏలూరు,మేజర్ న్యూస్:** ఏలూరు నగరంలోని గుడ్ న్యూస్ 7వ తరగతి చదువుతున్న పి.రాజ్యలక్ష్మి కుమార్ వెన్నెల ఓట్లు కొనే నాయకులకు వినూత్నంగా చురకలు వేసింది. పిన్నవయసులోనే ఆ పాప ‘ఈ ఇంట్లో ఓట్లు అమ్మబడవు’ అంటూ ఇంటి గేటుకి బోర్డు తగిలించడం విశేషం.

## కాపు సామాజిక వర్గాన్ని వంచనకు గురి చేశారు



**కైకలూరు,మేజర్ న్యూస్ :** స్థానిక కైకలూరు నియోజకవర్గ కాపు సామాజిక వర్గ సీనియర్ నాయకులు, కమ్మిలి విఠల్ రావు నియోజకవర్గ కాపు నాయకులతో కలిసి, మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గత పదవీకాలంలో కాపు కమ్యూనిటీని అనగదొక్కారని ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాపు సామాజిక వర్గం చైతన్యవంతంగా మేల్కొని ముందుకెళ్లాలని సూచించడం జరిగింది. కైకలూరు గ్రామ పౌరునిగా గ్రామసభలో కాపు సామాజిక వర్గానికి చెందిన కమ్మిలి విఠల్ రావుకు జరిగిన అవమానాన్ని, కిరాయి మనుషులతో కాపు సామాజిక వర్గాన్ని కొట్టించిన వైనాన్ని,కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులపై అక్రమ కేసులు పెట్టి వారిని ఇబ్బంది పెట్టిన వైనాన్ని, కాపు కులస్తులను చంపేస్తామంటూ బెదిరించిన ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు చేసిన ప్రతి అరాచకం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నాయని,ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి స్థానిక కాపు సామాజిక వర్గం అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

# పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు

- సంయమనం పాటిస్తూ ఓటింగ్ శాతం పెరిగేందుకు సహకరించాలి
- రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి



**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లాలో ఈనెల 13వ తేదీన జరిగే పోలింగ్ రోజున ఏవిధమైన వివాదాలకు ఆస్కారం లేకుండా పోలింగ్ ప్రక్రియ స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రశాంతంగా, సజావుగా సాగేందుకు రాజకీయ పక్షాలు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ రాజకీయ పక్షాల ప్రతినిధులను కోరారు. స్థానిక కలెక్టరేట్ లో శుక్రవారం సాధారణ ఎన్నికలు–2024 కు సంబంధించి పోలింగ్ కు ముందు చివరి 72 గంటల ప్రొటోకాల్, ఎన్నికల సన్నద్ధత, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, తదితర అంశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో, ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులతో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియనుప్రశాంతవాతావరణంలోస్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలు తలెత్తితే సంయమనం పాటించాలని అటువంటి సమస్యను తమ దృష్టికి నేరుగా తీసుకురావచ్చున్నారు. పోలింగ్ రోజున జిల్లా ప్రధాన కేంద్రంలో తాము అందుబాటులో ఉంటామని ఏమైనా సమస్య తలెత్తితే 9491041487 కు ఫోన్ చేసి తెలియజేయవచ్చున్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం పోలింగ్ తేదికి 48 గంటల ముందుఅనగాఈనెల11వ తేదీసాయంత్రం 6గంటల నుంచి సైలెంట్ ప్రచారం ఆపేయాల్సివుంటుంద న్నారు. ఈ సమావేశంలో డిఆర్వో డి.పుష్ప మణి,రుద్ర పాకరత్నారావు(ఆంధ్రరాష్ట్ర ప్రజా సమితి)రాజకీయ పార్టీల ప్రతినిధులు సిర్రా భరత్ (బీఎస్పీ)నేరుసు నెలరాజు(బిజెపి), ఏస్.సత్యనారాయణ (సిపియం)ఏస్.అచ్యుత్ బాబు(టిడిపి)డి.సూర్య నారాయణ,(వై ఎస్ ఆర్ సీపీ) పాల్గొన్నారు.

## దిగమర్రులో మైనింగ్ విజిలెన్స్ అధికారుల దాడి






**పాలకొల్లు,మేజర్ న్యూస్:** మండలంలో దిగమర్రు గ్రామంలో శుక్రవారం మైనింగ్ విజిలెన్స్ అధికారులు దాడి చేశారు, పశ్చిమగోదావరి నుండి తూర్పుగోదావరి జిల్లాకు అక్రమంగా మట్టి తరలిస్తున్న అనేక ట్రాక్టర్లను గుర్తించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు, మైనింగ్ అధికారులతో ట్రాక్టర్ యజమానులు, రైతుల మధ్య ఘర్షణ నెలకొంది, ఈ దాడిలో మైనింగ్ ఆర్ ఐ రమణ, వారి సిబ్బంది, పాలకొల్లు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబు,సిఎం జగన్ పర్యటన ప్రాంతాలను పరిశీలించిన ఎస్‌పి





**ఏలూరు,మేజర్ న్యూస్:** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ఏలూరు జిల్లా పర్యటన నేపథ్యంలో ఏలూరు పన్నెండు పంపుల సెంటర్ వద్ద సభా స్థలం భద్రతా పరమైనటువంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బారికెండ్లు నిర్మాణాన్ని గురించి,విఐపి భద్రత కొరకు తీసుకోవలసిన చర్యలను గురించి అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి జిల్లా ఎస్పీ డి మేరీ ప్రశాంతి అధికారులకు తగిన సూచనలు సలహాలు ,ఆదేశాలు ఇచ్చారు. అనంతరం శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కైకలూరు పర్యటన నేపథ్యంలో పర్యటన చేసే ప్రాంతాలను హెలిపాడ్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి,వి.విఐ.పి పర్యటనలో ఎటువంటి సంఘటనలు జరగకుండా తీసుకోవలసిన చర్యలను గురించి అధికారులతో చర్చించారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా పటిష్టమైనటువంటి ప్రణాళికతో ఉద్యోగ నిర్వహణ చేయాలని అధికారులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చిన జిల్లా ఎస్పీ. ఈ పర్యటనలో ఏలూరు డి.ఎస్.పి ఈ శ్రీనివాసులు ,ఎస్.బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏ.అర్,అర్.ఐ పవన్ కుమార్,ఏలూరు 2 టౌన్ ఇన్స్పెక్టర్ ,కైకలూరు టౌన్ ఇన్స్పెక్టర్,రూరల్ సీఐ ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## మా ఓట్లు ఎవరికి అమ్మబడవు అని ఫ్లెక్సీ పెట్టి వినూత్నంగా నిరసన




**ఏలూరు,మేజర్ న్యూస్:** ప్రస్తుత పరిస్థితుల్లోఎన్నికలంటేనే ప్రలోభాలకు వేదికలుగా మారా యి. రాజకీయ పార్టీలు ఓటర్లు తమ వైపునకు తిప్పుకోవ డానికి డబ్బులు ఎరవేస్తున్న రోజులివి. ఇలాంటి కాలంలో తాము ఓట్లు అమ్ముకోమంటూ ఏలూరు కొత్తపేటకు చెందిన కోట్ని పార్వతి ఆదర్శంగా నిలిచింది. తమ డాబాలో నివాసం ఉంటున్న వారందరూ ఓట్లు అమ్మకానికి లేవంటూఒకేమాట మీద నిలబడి రాజ్యాంగ స్ఫూర్తిని చాటిన వైనం.

## పోలింగ్ సామాగ్రి అందజేయడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ జిల్లా,ఎన్నికల అధికారి సుమిత్ కుమార్



**భీమవరం,మేజర్ న్యూస్:** కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గూగుల్ మీట్ ద్వారా జిల్లాలోని ఆర్వోలతో శుక్రవారం పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్, తదితరు ఏర్పాట్లపై సమీక్షించారు. 12వ తేదీన ఎన్నికల సామాగ్రి పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద అవసరమైన అన్ని వసతులను కల్పించాలని సూచించారు. ర్యాండ్ మైజేషన్ ప్రక్రియ ప్రకారం ఈవీఎంలను సరిచూసి పంపిణీ చేయాలన్నారు. పోలింగ్ సమయములో ఈవీయంలో సమస్యలు ఎదురైతే వెంటనే సెక్టార్ అధికారులు రిజర్వుడు ఈవీఎం యంత్రాలను భర్తీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే అన్ని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు ఆదివారం ఉదయం 5.00 గంటలకల్లా ఆర్టీసీ బస్సులు ఉండేలా ఏర్పాటు చేయాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ను ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి సామగ్రి పంపిణీ చేయుటకు హమాలీలకు ముందుగా శిక్షణ ఇవ్వాలని ఆర్ ఓ లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ జె.ఉదయ భాస్కరరావు,ఎలక్షన్ సూపరింటెండెంట్ సిహెచ్ దుర్గాప్రసాద్, కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు. కానాల సంగీత్ మాధుర్, జెడ్.వెంకటేశ్వరరావు, ఎం మోహన్ రావు, యు మంగపతిరావు,ఆర్.విక్టర్, కె.జాషువాపాల్గొన్నారు.

## టిడిపి నుండి వైసీపీలోకి



**కుక్కనూరు,మేజర్ న్యూస్ :** కుక్కునూరు మండల పరిధిలోని మారేడుబాక గ్రామానికి చెందిన ముప్పాల సత్యనారాయణ తెలుగుదేశం పార్టీలో గత కొన్ని సంవత్సరాల నుంచి పార్టీ కోసం పని చేసిన మండల నాయకులు శుక్రవారం ఏలూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి కారు మురి సునీల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. వైసిపి నాయకుల ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షనీతులై పార్టీలో చేరుతున్నారని అలాగే 2024 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రిగా చేయాలని అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కష్టపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ కుచర్లపాటి నరసింహారాజు మరియు నాయకులు రావు వినోద్ కుచర్లపాటి కృష్ణంరాజురాయిసత్యనారాయణఎంపీపీలు గాడిద రామచంద్రరావు రాజేష్ కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.

# నేడే మహిళలకు ముగ్గుల పోటీలు

**ఏలూరు,మేజర్ న్యూస్:** ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వినియోగంపై జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ వారి ఆదేశాల మేరకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామ పంచాయితీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు.శక్రవారం స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామ పంచాయితీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ మాట్లాడుతూ ముగ్గుల పోటీలు ఉదయం 9.00 గంటల నుండి ఉదయం 11.00 గంటల వరకు స్థానిక సెయింట్ థెరీస్సా మహిళా డిగ్రీ కళాశాలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలిచిన వారికి ప్రథమ బహుమతిగా రూ. 20 వేలు, ద్వితీయ, తృతీయ,బహుమతులుగా రూ. 15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు ప్రోత్సాహం జిల్లా కలెక్టర్ వారి చేతులమీదుగా అందజేయడం జరుగుతుందని తెలిపారు.